ఆర్థికాభివృద్ధికి చేయూత

- ప్రారంభానికి ముస్తాబవుతున్న జగనన్న చేయూత మహిళా మార్ట్
- మహిళా సంఘాల ఆధ్వర్యంలో నిర్వహణ


నల్లజర్లలో ముస్తాబవుతున్న జగనన్న చేయూత మహిళా మార్ట్

నల్లజర్ల: ఇక్కడ మహిళలే యజమానులు, పెట్టుబడిదారులు, వారే నిర్వాహకులు.. అనుకున్న స్థాయిలో ఆర్థికాభివృద్ధి సాధించేందుకు ముందడుగు వేశారు. వారి ఆత్మవిశ్వాసానికి ప్రభుత్వం అండగా నిలిచింది. ఆర్థిక స్వావలంబనకు చేయూతనందించింది. మహిళా మార్ట్ ఏర్పాటు చేయించింది. నల్లజర్లలోని సహకార సంఘం పై అంతస్తులో ఏర్పాటు చేసిన జగనన్న చేయూత మహిళా మార్ట్ ప్రారంభానికి సిద్ధమవుతోంది. మండలంలోని స్వయం సహాయక సంఘాల సభ్యులంతా తమ పొదుపు సొమ్మును పెట్టుబడిగా పెట్టి ఈ మార్ట్‌ను ఏర్పాటు చేస్తున్నారు. ఈమార్ట్‌లో అన్ని రకాల నిత్యావసర సరుకులతో పాటు డ్వాక్రా మహిళలు తయారు చేసిన వివిధ రకాల వస్తువులు, పచ్చళ్ళు, తినుబండారాలు విక్రయానికి ఉంచుతారు.

మహిళల పర్యవేక్షణలోనే..

చేయూత మహిళా మార్ట్‌లో వస్తువులు కొనుగోలు నుంచి అమ్మకాలు వరకూ అంతా మహిళల పర్యవేక్షణలోనే జరుగుతుంది. మండలంలో 2023 మహిళా సంఘాలలోని 20330 మంది సభ్యులు ఉన్నారు. ఒక్కో సభ్యురాలు తమ పొదుపు ఖాతా నుంచి రూ.250 పెట్టుబడిగా రూ.50,80,500 పెట్టారు. దీంతో కార్పొరేట్ సంస్థల మార్ట్‌లను తలదన్నేలా తయారు చేశారు. తూర్పుగోదావరి జిల్లాలోనే ఇది రెండో మార్ట్‌గా ఉంది. వస్తువుల అమరికకు ప్రత్యేకంగా షెల్ఫ్‌లు ఏర్పాటు చేశారు. కొన్న వస్తువులు తరలించడానికి ట్రాలీలు, బకెట్లు కూడా ఉండారు. మార్ట్ నిర్వహణ ద్వారా వచ్చే లాభాలలో నిర్వహణ ఖర్చు పోను మిగతా మొత్తాన్ని పెట్టుబడి పెట్టిన సభ్యులందరికీ సమానంగా పంచుతారు.



ఆరుగురికి ఉపాధి..

ఈ మార్ట్‌లో తనతో పాటు ఆరుగురు మహిళలకు ఉపాధికి మార్గం లభించింది. ఇప్పటి వరకు 50 శాతం సరకులు తీసుకువచ్చాం. నాణ్యమైన సరుకు, ఇతరులకు ఇచ్చే ధరల కంటే తక్కువకు వచ్చే విధంగా వాల్‌మార్ట్, హిందుస్తాన్, ఐటీసీ వంటి సంస్థలతో మాట్లాడి సరకులు తీసుకువచ్చే ఏర్పాటు చేస్తున్నాం. బయట మార్కెట్ కంటే తక్కువ ధరలకు సరకులు అందించేందుకు కృషి చేస్తున్నాం.

– పి.శ్రీనివాస్, మార్ట్ మేనేజరు

అందుబాటులో నిత్యావసర వస్తువులు



ఈ వారంలో మార్ట్ ప్రారంభానికి సిద్ధం చేస్తున్నాం. ఇక్కడ నిత్యావసర వస్తువులన్నీ లభిస్తాయి. బియ్యం, పప్పు దినుసులు, ఇంట్లో నిత్యం వాడుకునే సరుకులన్నీ బయట మార్కెట్ కంటే తక్కువ ధరకు అందించే ఏర్పాటు చేస్తున్నాం. తినుబండారాలు, ఇతర వస్తువులు తయారుచేసే డ్వాక్రా మహిళలకు గుర్తింపునిచ్చి వారు తయారు చేసే వస్తువులన్నీ మార్ట్‌లో పెడతాం.

– కె.విజయ నిర్మలకుమారి, ఏపీఎం, నల్లజర్ల

స్వావలంబనే లక్ష్యం



పొదుపు సంఘాల మహిళల్లో పేద, మధ్య తరగతి వారే ఎక్కువ. ఈ మార్ట్ ద్వారా వారికి చేయూత లభిస్తుంది. బయట మార్కెట్‌లో ధరలకంటే ఇక్కడ తక్కువ ఉంటుంది. అంతే కాకుండా గ్రామ సంఘాల ఆధ్వర్యంలో మహిళా సంఘాలన్నీ మార్ట్‌లో సరకులు కొనుగోలు చేసేలా అవగాహన కల్గిస్తున్నాం. డ్వాక్రా రుణాలతో ఏర్పాటు చేసిన చిన్న షాపుల వారు ఇక్కడే సరుకులు కొనుగోలు చేసుకోవచ్చు.

– యస్‌కే జవహరున్నీసా, మార్ట్ ఇన్‌చార్జి(సీసీ)

క్లుప్తంగా

వైఎస్సార్ సీపీ జిల్లా కార్యదర్శిగా సత్యనారాయణ


ఎమ్మెల్యే తలారిని సత్కరిస్తున్న సత్యనారాయణ

నల్లజర్ల: వైఎస్సార్ సీపీ జిల్లా కార్యదర్శిగా మండలంలోని దూబచర్లకు చెందిన బీసీ నాయకుడు పంది సత్యనారాయణ నియమితులయ్యారు. ఆయన సోమవారం సాయంత్రం దేవరపల్లిలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే తలారిని మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేను శాలువా, పూలమాలల వేసి కృతజ్ఞతలు తెలిపారు. నల్లజర్లలో సొసైటీ అధ్యక్షుడు కారుమంచి రమేష్‌ను కలిశారు. ఆయన వెంట తొమ్మండ్రు రవి, మానికల సాయి బాబా, తాడిగడప సుబ్బారావు, బొర్రాశ్రీనివాస్, కెనడీ, విల్సన్, పంది శ్రీనివాస్, సిరిబత్తుల వీర్రాజు, నీలపాలరాంబాబు, గాజులరాజు, ఆదూరి సత్యనారాయణ, నాయుడు అబ్బులు, చేబ్రోలు బాబూరావు, విన్నీ, తాడిగడప టీవీఎస్ సుబ్బారావు తదితరులున్నారు.

ఉపాధి హామీ ఏపీఓగా రమణ


జె.వి.రమణ

నల్లజర్ల: మండలంలో జాతీయ ఉపాధి హామీ ఏపీఓగా జేవీ రమణ నియమితులయ్యారు. పోలవరంలో పని చేస్తూ బదిలీపై ఆమె ఇక్కడకు వచ్చారు. ఇంతవరకు ఇక్కడ పని చేసిన ఏపీఓ సత్యనారాయణ డ్వామా పీడీ కార్యాలయానికి బదిలీ అయ్యారు.

ఫ్యాన్ల వితరణ

పెరవలి: స్థానిక ఉన్నత పాఠశాలలో 2005లో పదో తరగతి చదువుకున్న పూర్వ విద్యార్థులు రూ.6 వేల విలువ కలిగిన రెండు ఫ్యాన్లు ఆ పాఠశాలకు వితరణ చేశారు. సోమవారం ప్రధానోపాధ్యాయుడు ప్రసాదరావుకి వాటిని అందజేశారు.

కొవ్వూరులో ఆహా క్యాంటీన్ ప్రారంభం


కొవ్వూరులో ఆహా క్యాంటీన్ ప్రారంభిస్తున్న హోమ్ మంత్రి తానేటి వనిత

కొవ్వూరు: పట్టణ మహిళా సమాఖ్య నిధుల ద్వారా డ్వాక్రా మహిళలు ఏర్పాటు చేసిన ఆహా క్యాంటీన్‌ను రాష్ట్ర హోమ్ మంత్రి తానేటి వనిత సోమవారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ బావన రత్నకుమారి, కమిషనర్ బి.శ్రీకాంత్, టీఎంసీ జేవీవీఎస్ భవానీ, శ్రీరామ సొసైటీ అధ్యక్షుడు అక్షయపాత్ర శ్రీనివాస రవీంద్ర పాల్గొన్నారు.

మంత్రి పరామర్శ

చాగల్లు: మండల వైస్ ఎంపీపీ జుజ్జవరపు రామచంద్రరావును రాష్ట్ర హోంశాఖ మంత్రి తానేటి వనిత సోమవారం పరామర్శించారు. ఇటీవల రామచంద్రరావు మనవుడు అరుణ్(12) అకాల మృతి సందర్భంగా చాగల్లులోని ఆయన నివాసానికి విచ్చేసిన మంత్రి తానేటి వనిత వారి కుటుంబ సభ్యులను పరామర్శించి, సానుభూతిని తెలిపారు. ఆమె వెంట వైఎస్సార్‌సీపీ రైతు విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆత్కూరి దొరయ్య, వైఎస్సార్ సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు గండ్రోతు సురేంద్రకుమార్, వైఎస్సార్ సీపీ మండల గౌరవ అధ్యక్షులు, అధ్యక్షులు జుట్టా కొండలరావు, చెల్లింకుల దుర్గామల్లేశ్వరరావు, ముళ్లపూడి ఉదయ్‌భాస్కర్, బొర్రా రజనీ ప్రసాద్, వర్ధినేడి చిన బాబు, బలుసు శేఖర్, జాలెం వెంకట్రావు పాల్గొన్నారు.

జగనన్న కాలనీల అభివృద్ధే లక్ష్యం


ఉండ్రాజవరంలో గృహప్రవేశ కార్యక్రమంలో పాల్గొన్న సుబ్బారావు

ఉండ్రాజవరం: జగనన్న కాలనీల అభివృద్ధే ప్రభుత్వం లక్ష్యమని జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ బూరుగుపల్లి సుబ్బారావు అన్నారు. ఉండ్రాజవరంలో సత్యవాడ రోడ్డులో జగనన్న కాలనీలో సోమవారం కోమ్మిరెడ్డి వెంకటరత్నం గృహ ప్రవేశ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. జగనన్న కాలనీలో లబ్ధిదారులు ఇళ్ల నిర్మాణాలు త్వరగా పూర్తి చేసుకోవాలన్నారు. నిమ్మన శ్రీనివాసు, మారిశెట్టి నాగేశ్వరరావు, శనివారపు కామయ్య, నరహరిశెట్టి కేశవ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

సారాతో వ్యక్తి అరెస్టు

తాళ్లపూడి: రాగోలపల్లిలో సారా తయారు చేస్తున్న వ్యక్తిని అరెస్టు చేసి, అతని నుంచి 5 లీటర్ల సారా, 120 కేజీల బెల్లాన్ని స్వాధీనం చేసుకున్నట్టు తాళ్లపూడి ఎస్సై కె.వెంకట రమణ తెలిపారు. పోలీస్‌స్టేషన్‌కు వచ్చిన సమాచారం మేరకు సిబ్బంది భగవాన్‌దాస్ తదితరులతో కలిసి సోమవారం దాడి చేశామన్నారు. ఈ దాడిలో పొనుకుమాటి రామారావు సారా తయారు చేస్తుండగా పట్టుకొని అదుపులోకి తీసుకొని 5 లీటర్ల సారా, బెల్లం సీజ్ చేసి, కోర్టుకు రిమాండ్‌కు తరలించామన్నారు.

విగ్రహాలు ధ్వంసం చేసిన వారిపై చర్యలు తీసుకుంటాం

ఎమ్మెల్యే తలారి వెంకట్రావు


పాఠశాలలో నాయకుల విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులు అర్పిస్తున్న ఎమ్మెల్యే, డీఎస్పీ, ఆర్డీఓ

గోపాలపురం: భారత రాజ్యాంగ నిర్మాత బీఆర్ అంబేడ్కర్, మాజీ ఉపప్రధాని బాబూ జగ్జీవన్‌రామ్‌ల విగ్రహాలను ధ్వంసం చేసిన వారిపై చట్టరపరమైన చర్యలు తీసుకుంటామని గోపాలపురం ఎమ్మెల్యే తలారి వెంకట్రావు అన్నారు. వాదాలకుంటలో ఆదివారం నాయకుల విగ్రహాల ధ్వంసం చేయడంతో దళిత సంఘాలు ఆందోళన చేసిన విషయం విదితమే. దళిత సంఘాలకు ఇచ్చని హామీ మేరకు సోమవారం వాదాలకుంట పాఠశాలలో ధ్వంసం చేసిన విగ్రహాలకు మరమ్మతులు చేయించి, వాటికి ఎమ్మెల్యే తలారి వెంకట్రావు, కొవ్వూరు ఆర్డీఓ ఎస్ మల్లిబాబు, కొవ్వూరు డీఎస్పీ వీఎస్ వర్మ పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ విగ్రహాల ధ్వంసం చేసిన వారిని గుర్తించి చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. ఈకార్యక్రమంలో సర్పంచ్ జొన్నకూటి మనెమ్మ, ఎంపీపీ వుండవల్లి సత్యనారాయణ, కూసం రామమోహన్‌రెడ్డి, ఆయా సంఘాల నాయకులు పాల్గొన్నారు.

నిడదవోలు గడ్డర్ బ్రిడ్జి నిర్మాణానికి రూ.4.65 కోట్లు

నిడదవోలు: పట్టణంలో చినపకాశిరేవు వద్ద పశ్చిమ డెల్టా ప్రధాన కాలువ (అప్పారావు చానల్)పై 1935లో బ్రిటీష్ హయాంలో నిర్మించి పురాతన బ్రిడ్జి పునర్నిర్మాణానికి ప్రభుత్వం నిధులు మంజూరు చేసింది. ఆర్అండ్‌బీ శాఖ నుంచి మంజూరైన రూ.4.65 కోట్లతో పనులు చేపట్టనున్నారు. గత పుష్కరాల సమయంలో పురాతన బ్రిడ్జిపై అధిక లోడు వాహనం వెళ్లడంతో ఒక వైపు కుప్పకూలిపోయింది. దీంతో 2015లో రూ.90లక్షలతో వంతెన మరమ్మతులు చేపట్టారు. పనుల్లో నాణ్యత లోపించడంతో రెండేళ్లకే వంతెన కుప్పకూలిపోయింది. అప్పటి నుంచి చినకాశిరేవులో కొలువుదీరిన ఆలయాలకు భక్తులు వెళ్లడానికి నానా అవస్థలు పడుతున్నారు. అలాగే కోట్లాది రూపాయలతో నిర్మించిన రోటరీ, మున్సిపల్ కైలాస భూమికి వెళ్లడానికి ఇబ్బందులు ఎదుర్కొంటున్న తరుణంలో ఎమ్మెల్యే జి. శ్రీనివాస్‌నాయుడు కృషితో వంతెన నిర్మాణానికి ప్రభుత్వం నిధులు మంజూరు చేసింది. త్వరలో వంతెన నిర్మాణ పనులు చేపట్టి భక్తులు, ప్రజలు పడుతున్న ఇబ్బందులకు శాశ్వత పరిష్కారం చూపుతామని ఎమ్మెల్యే స్పష్టం చేశారు.

సెప్టెంబర్ మొదటి వారంలో సీఎం పర్యటన

- హోమ్ మంత్రి తానేటి వనిత
- పార్టీ ప్రజాప్రతినిధులతో సమావేశం


క్యాంపు కార్యాలయంలో ప్రజాప్రతినిధులతో మాట్లాడుతున్న మంత్రి వనిత

కొవ్వూరు: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఈ నెల 30వ తేదీన నిడదవోలు పర్యటన వర్షాల కారణంగా వాయిదా పడిందని, సెప్టెంబర్ మొదటి వారంలో నిర్వహించే అవకాశం ఉందని రాష్ట్ర హోమ్ మంత్రి తానేటి వనిత పేర్కొన్నారు. పట్టణంలో మంత్రి క్యాంపు కార్యాలయంలో సోమవారం సీఎం పర్యటన, అభివృద్ధి పనులు, గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహణపై నాయకులు, ప్రజాప్రతినిధులతో సమీక్షా సమావేశంలో నిర్వహించారు. ఇటీవల నియోజకవర్గ స్థాయి సమీక్షలో లేవనెత్తిన సమస్యలు సత్వరం పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని ప్రకటించారు. గ్రామ, వార్డు సచివాలయాలు, రైతు భరోసా కేంద్రాలు, విలేజ్ క్లినిక్ భవనాల నిర్మాణ పనులను వేగవంతం చేసేందుకు నాయకులు, ప్రజాప్రతినిధులు కృషి చేయాలని సూచించారు.

సీఎం పర్యటన తేదీ ఖరారైన వెంటనే నాయకుల అందరికి తెలియజేస్తామన్నారు. నియోజకవర్గంలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం 70 శాతం పూర్తయిందన్నారు. ఎంపీపీలు కాకర్ల నారాయుడు, జొన్నకూటి పోసిరాజు, పార్టీ రాష్ట్ర రైతు విభాగం కార్యదర్శి ఆత్కూరి దొరయ్య, మండల పార్టీ అధ్యక్షులు సుంకర సత్యనారాయణ, కాకర్ల వెంకటేశ్వరరావు, నాయకులు సుంకర రాయుడు, పట్టణ పార్టీ గౌరవ అధ్యక్షుడు నగ్గలపాటి శ్రీనివాస్, నక్కా చిట్టిబాబు తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలల్లో ఎలక్టోరల్ లిటరసీ క్లబ్‌ల ఏర్పాటు

తాళ్లపూడి: నియోజకవర్గ ఎలక్టోరల్ ఆఫీసర్ మల్లిబాబు, తాళ్లపూడి తహసీల్దార్ టి.రాధిక ఆదేశాల మేరకు మండలంలోని ఆరు ఉన్నత పాఠశాలల్లో ఎలక్టోరల్ లిటరసీ క్లబ్‌లను ఏర్పాటు చేస్తున్నట్టు ఏఎస్ఓ జె.వెంకటేశ్వరరావు తెలిపారు. సోమవారం వేగేశ్వరపురంలోని కేఎస్ఆర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 9, 10 తరగతుల విద్యార్థులకు ఎన్నికల విధానంపై అవగాహన కల్పించారు. ఎన్నికలు ఎలా జరపాలి అనే అంశాలపై ప్రతి నెలా అవగాహన కల్పిస్తామని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో సీహెచ్ బాలామణి, ఎంఈవో–2 సీహెచ్ నెహ్రూజీ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కాపు నాయకులను కలిసిన ముద్రగడ


చాగల్లులో నాయకులతో మాట్లాడుతున్న మాజీ మంత్రి, కాపు ఉద్యమ నేత ముద్రగడ పద్మనాభం

తాళ్లపూడి: కాపు ఉద్యమ నేత, మాజీ ముద్రగడ పద్మనాభం సోమవారం మండలంలోని తాళ్లపూడి, వేగేశ్వరపురం గ్రామాల్లోని కాపు నాయకులను మర్యాద పూర్వకంగా కలిశారు. జిల్లా కాపు సంఘం కార్యవర్గ సభ్యులు వనిమిరెడ్డి శ్రీనివాస్ కుమార్తె వివాహ వేడుక సందర్భంగా నూతన వధువరులను ఆశీర్వదించారు. ఆయన వెంకట కాపు జేఏసీ నాయకులు తోట రామకృష్ణ, వైఎస్సార్ సీపీ నాయకులు తదితరులున్నారు. అనంతరం పద్మనాభం వేగేశ్వరపురంలోని శీర్ల బ్రహ్మానందం కుటుంబ సభ్యులను పరామర్శించారు.

చాగల్లు: చాగల్లు వచ్చిన మాజీ మంత్రి ముద్రగడ్డ పద్మనాభంను వైఎస్సార్‌సీపీ మండల శాఖ గౌరవాధ్యక్షుడు జుట్టా కొండలరావు నివాసంలో పలువురి నాయకులు మర్యాద పూర్వకంగా కలిశారు. అనంతరం వైఎస్సార్ సీపీ నాయకులు గండ్రోతు సూర్యనారాయణ భార్య నాగమణి ఇటీవల మృతి చెందడంతో వారి కుటుంబ సభ్యులను ముద్రగడ పరామర్శించి ప్రగాడ సానుభూతిని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు జిల్లా ఉపాధ్యక్షుడు గండ్రోతు సురేంద్ర కుమార్, ఎంపీటీసీ ఇంటి బాలా వెంకట కృష్ణవేణి, వైఎస్ఆర్‌సీపీ నాయకులు, కాపు నేతలు పాల్గొన్నారు.

ప్రతి ఇంటా సంక్షేమం

- హోం మంత్రి తానేటి వనిత
- చాగల్లులో గడప గడపకూ మన ప్రభుత్వం


చాగల్లులో గ్రామంలో ప్రభుత్వ సంక్షేమ పథకాలను వివరిస్తున్న మంత్రి తానేటి వనిత, నాయకులు

చాగల్లు: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలతో ప్రతి ఇంటా సంతోషం వెల్లివిరిస్తోందని రాష్ట్ర హోంమంత్రి, విపత్తుల నిర్వహణ శాఖ మంత్రి డాక్టర్ తానేటి వనిత అన్నారు. చాగల్లులో సచివాలయం–1 పరిధిలో సోమవారం గడపగడపకూ మన ప్రభుత్వ కార్యక్రమం నిర్వహించారు. హోం మంత్రి ఇంటింటికీ వెళ్లి నాలుగేళ్లుగా ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి పనులు, అమలు చేస్తున్న పథకాలను ప్రజలకు వివరించారు. ఏవైనా సమస్యలున్నా, అర్హులై ఉండి ఎవరికైనా పథకాలు అందకపోయినా వెంటనే తెలియజేయాలన్నారు. ఈ క్రమంలో పలువురు ఆమె దృష్టికి తీసుకువచ్చిన చిన్నచిన్న సమస్యలను పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా హోం మంత్రి తానేటి వనిత మాట్లాడుతూ గడప గడపకూ సంక్షేమ పథకాలు అందిస్తున్న ఘనత ఒక్క జగనన్న ప్రభుత్వానికే దక్కుతుందన్నారు. ప్రజా సమస్యలను తెలుసుకొని వాటిని పరిష్కరించేందుకే గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని సీఎం రూపొందించారని తెలిపారు. వచ్చే ఎన్నికల్లో సీఎంకు అందరూ అండగా ఉండాలని కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ రైతు విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆత్కూరి దొరయ్య, ఎంపీపీ మట్టా వీరాస్వామి, వైస్ ఎంపీపీ జుజ్జవరపు రామచంద్రరావు, చెల్లింకుల శ్రీవిజయ, పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు గండ్రోతు సురేంద్రకుమార్, ఎంపీటీసీలు, నాయకులు, కార్యకర్తలు, అధికారులు, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

చిరు వ్యాపారికి సాయం అందించిన మంత్రి


చాగల్లు: చాగల్లులోని సిపాయిలదిబ్బ వీధిలో చిన్న హోటల్ వ్యాపారికి అండగా మంత్రి వనిత నిలిచారు. గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా చాగల్లులో పర్యటిస్తుండగా చెల్లింకుల లక్ష్మి ఇంటికి వెళ్లి జగనన్న ప్రభుత్వం ఈ నాలుగేళ్లలో అందించిన సాయాన్ని వివరించారు. లక్ష్మి కూతురు శ్రీరాము ఎనిమిదో తరగతి చదువుతోందని, తనకి పడిన అమ్మఒడి డబ్బులతో చిన్న హోటల్ నడుపుకొంటూ కుటుంబాన్ని పోషిస్తున్నట్టు మంత్రికి వివరించారు. వెంటనే హోంమంత్రి వారి చిరు వ్యాపారానికి అవసరమైన సాయం అందేలా చూడాలని అధికారులను ఆదేశించారు. కాసేపు వారి హోటల్‌లో సహాయం చేస్తూ బజ్జీలు అమ్మారు. స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులు, అధికారులకు హోంమంత్రి స్వహస్తాలతో టిఫిన్ అందజేస్తూ వచ్చిన మొత్తాన్ని యజమానులకు అందజేశారు. పాప శ్రీరాము భవిష్యత్‌కు అండగా ఉంటామని హోం మంత్రి వనిత భరోసా కల్పించారు.

విద్యార్థులకు వ్యాసరచన పోటీలు


వ్యాసరచన పోటీలకు హాజరైన విద్యార్థులు

నిడదవోలు: తెలుగు భాషా దినోత్సవం సందర్భంగా ఉన్నత విద్య కమిషనర్ ఆదేశాల మేరకు స్థానిక ఎస్వీఆర్‌కే ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సోమవారం విద్యార్థులకు వ్యాసరచన, క్విజ్ పద్య పఠనం పోటీలు నిర్వహించారు. పోటీల్లో గెలపొందిన విద్యార్థులకు మంగళవారం గిడుగు వెంకటరామమూర్తి జయంతి కార్యక్రమంలో బహుమతులు అందజేస్తామని ప్రిన్సిపాల్ డాక్టర్ కె.జ్యోతి పేర్కొన్నారు.

అభివృద్ధి పనులకు ఆమోదం



సమావేశంలో మాట్లాడుతున్న చైర్ పర్సన్ రత్నకుమారి, హాజరైన సభ్యులు

కొవ్వూరు: పురపాలక సంఘంలో చేపట్టే వివిధ అభివృద్ధి పనులకు కౌన్సిల్ ఆమోదం తెలిపింది. సోమవారం చైర్ పర్సన్ బావన రత్నకుమారి అధ్యక్షతన పురపాలక సంఘం సాధారణ సమావేశం నిర్వహించారు.ఈ సమావేశంలో కౌన్సిల్ ముందు 29 అంశాలు ఉంచగా 4 అంశాలను వాయిదా వేసి మిగిలినవి ఆమోదించారు. ఈ సందర్భంగా పట్టణంలో జరిగిన అభివృద్ధిని ఆయా శాఖల అధికారులు వివరించారు.

185 మందికి వైద్య పరీక్షలు

నిడదవోలు రూరల్: రావిమెట్ల గ్రామంలో రోటరీక్లబ్ ఆఫ్ నిడదవోలు మిడ్‌టౌన్ ఆధ్వర్యంలో గ్రామ ప్రగతి సొసైటీ ఆర్థిక సహకారంతో సోమవారం ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరాన్ని జెడ్పీటీసీ సభ్యుడు కొయ్యే సూరిబాబు, సర్పంచ్ కాల్దారి సూర్యకుమారి ప్రారంభించారు. శిబిరంలో పరమహంస నేత్రాలయం వైద్య సిబ్బంది 185 మందికి కంటి పరీక్షలు చేసి, మందులు, కళ్లజోళ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షుడు గుంపుల వెంకటేశ్వరరావు, కార్యదర్శి ఆకుల రాజీవ్, సభ్యులు గాలి రాఘవయ్య, ఇంజే శేఖర్, ఫణీసింహ, చైతన్య, కృష్ణంరాజు, సత్యప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

బాలుడి ఆచూకీ కోసం ముమ్మర గాలింపు

నిడదవోలు రూరల్: సమిశ్రగూడెం గ్రామానికి చెందిన ఎనిమిదేళ్ల బాలుడు పాలపర్తి రోహన్(రిక్కి) ఆచూకీ కోసం ప్రత్యేక పోలీస్ బృందాలతో గాలిస్తున్నామని ఎస్సై షేక్ సుభానీ తెలిపారు. బాలుడు రోహన్ ఈనెల 24వ తేదీ నుంచి కనిపించకపోవడంతో తండ్రి శ్రీనివాస్ ఇచ్చిన ఫిర్యాదుపై కేసు నమోదు చేశారు. శ్రీనివాస్ కుటుంబ సభ్యులతో ఎస్సై సుభానీ సోమవారం మాట్లాడి బాలుడి వివరాలు నమోదు చేసుకున్నారు. బంధువులు బాలుడు రోహన్‌ను దాచిపెట్టినట్టు అనుమానాలు వ్యక్తమవ్వడంతో ప్రత్యేకంగా దర్యాప్తు చేస్తున్నారు.

పటిక బెల్లంతో తులాభారం

దేవరపల్లి: స్థానిక బాలదుర్గమ్మ అమ్మవారి ఆలయంలో సోమవారం బాలుడిని పటికబెల్లంతో తులాభారం వేశారు. పశ్చిమగోదావరి జిల్లా పాలకొల్లు మండలం దగ్గులూరుకు చెందిన సిద్దాని శ్రీనివాసరావు, కల్యాణి దంపతుల కుమారుడిని పటికబెల్లంతో తులాభారం వేశారు.

వేంకటేశ్వరునికి అధిక ఆదాయం


వేలం పాట నిర్వహిస్తున్న అధికారులు

పెరవలి: అన్నవరప్పాడులో ఉన్న వేంకటేశ్వర స్వామి ఆలయంలో కొబ్బరి చెక్కలు, తలనీలాల వేలం పాట సోమవారం నిర్వహించామని ఆలయ ఈఓ మీసాల రాధాకృష్ణ తెలిపారు. ఈ వేలం పాటలో కొబ్బరి చెక్కల పాట రూ.4.03 లక్షలకు, తలనీలాల పాట రూ.55 వేలకు హెచ్చు పాట జరిగిందని తెలిపారు. ఈ వేలం ద్వారా ఆలయానికి ఏడాదికి రూ.4.58 సమకూరిందన్నారు. గత ఏడాది కొబ్బరి చెక్కలు, తలనీలాల వలన రూ.2.30 లక్షలకు వెళ్లగా ఈ ఏడాది మరింత పెరిగిందన్నారు. ఈ వేలం ఒక సంవత్సరానికి దేవదాయ ధర్మాదాయ శాఖాధికారి ఎంవీ రామయ్య పర్యవేక్షణలో నిర్వహించగా గ్రామ సర్పంచ్ పంతం బాలసుందరి, సొసైటీ అధ్యక్షుడు పంత నాగేశ్వరరావు, వైఎస్సార్ సీపీ నాయకులు పంతం చిన్న తదితర పెద్దల సమక్షంలో జరిగిందని తెలిపారు.

వాహనాలకు బహిరంగ వేలం

దేవరపల్లి: వివిధ కేసుల్లో పట్టుకున్న 21 వాహనాలను సోమవారం దేవరపల్లి ఎస్ఈబీ స్టేషన్ వద్ద అధికారులు బహిరంగ వేలం నిర్వహించారు. జిల్లా సూపరింటెండెంట్ పిట్టా సోమరాజు ఆదేశాల మేరకు అసిస్టెంట్ సూపరింటెండెంట్ డీఎస్ఎస్‌వీ ప్రసాద్ ఆధ్వర్యంలో సీఐ డి.సుధ వేలం నిర్వహించారు. ప్రభుత్వ ధర రూ.1,34,700 నిర్ణయించి వేలం వేయగా, దీని కంటే హెచ్చు ధర రూ.2,34,700 పాటదారులు వాహనాలను దక్కించుకున్నారు. దీంతోపాటు రూ.38,376 జీఎస్టీ వసూలు చేసినట్టు సీఐ తెలిపారు. స్టేషన్ పరిధిలో పట్టుబడిన 201.3 లీటర్ల సారా, 313 మద్యం సీసాలు(డ్యూటీ పేయిడ్), 198 నాన్ డ్యూటీ పెయిడ్ మద్యం సీసాలను ధ్వంసం చేసినట్టు తెలిపారు.